క్లుప్తంగా

కంప్యూటర్ ఆపరేటర్ మృతికి సంతాపం



సంపత్‌కుమార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎంఈఓలు, ఉపాధ్యాయులు

వీరఘట్టం: మండల విద్యాశాఖ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న ఎస్.సంపత్‌కుమార్ అనారోగ్యంతో రెండు రోజుల కిందట మృతి చెందాడు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తూ స్థానిక ఎమ్మార్సీలో ఎంఈఓలు గౌరినాయుడు, ఆనందరావు, ఉపాధ్యాయులు, ఎమ్మార్సీ సిబ్బంది సోమవారం సంతాపం తెలియజేశారు. సంపత్ కుమార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అన్ని పాఠశాలల ఉపాధ్యాయులు సంపత్ కుటుంబానికి అండగా నిలవాలని ఎంఈఓలు పిలుపునిచ్చారు.

విద్యారంగ సమస్యలపై ధర్నా



డీడీకి వినతిపత్రం ఇస్తున్న గిరిజన సంఘాల నాయకులు

సీతంపేట: విద్యారంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక ఐటీడీఏ వద్ద యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, భాషా వలంటీర్లు, ఎస్ఎఫ్ఐ, గిరిజన సంఘాల నేతలు సోమవారం సాయంత్రం ధర్నా చేపట్టారు. పీజీ హెచ్ఎంలు, ఎస్ఏ క్యాడర్ ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని, జీఓ నంబర్ 3 పునరుద్ధరించాలని, జూన్ నుంచి సవర భాషా వలంటీర్లను కొనసాగించాలని కోరారు. జీపీఎస్ పాఠశాలల్లో ఇద్దరు ఉపాధ్యాయులు చొప్పున ఉండేలా సర్దుబాటు చేయాలని, సీఆర్‌టీలను రెగ్యులర్ చేయాలని, ఆశ్రమ పాఠశాలల్లో ఏఎన్ఎం, కుక్, కమాటీలను నియమించాలని డిమాండ్ చేశారు. అనంతరం గిరిజన సంక్షేమ శాఖ డీడీ అన్నదొరకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు ఎం.లక్ష్మణరావు, కె.కృష్ణారావు, కె.రాజు, రమేష్, ఎల్లంగో, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

సారా వ్యాపారులపై బైండోవర్ కేసు నమోదు



సారా వ్యాపారాలు చేయమని ప్రమాణం చేయిస్తున్న సీఐ జీడీ బాబు

సాలూరు: సారా వ్యాపారస్తులు 34 మందిపై తహసీల్దార్ బాలమురళీకృష్ణ ద్వారా పట్టణ సీఐ జీడీ బాబు బైండోవర్ కేసులు నమోదు చేయించారు. అనంతరం తన కార్యాలయానికి వారిని పిలిపించి సారా వ్యాపారం ఇకపై చేయమని ప్రమాణం చేయించారు. సారా విక్రయాల వల్ల కలిగే ఇబ్బందులను వివరించారు.

ఫైలేరియా నివారణకు ప్రత్యేక డ్రైవ్

సీతానగరం: ఫైలేరియా నివారణకు రక్త నమూనాలు సేకరించడానికి ఆదివారం రాత్రి సీతానగరం మండలంలోని అన్నిగ్రామాల్లో వైద్యాధికారి డాక్టర్ పావని ఆధ్వర్యంలో సిబ్బందితో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించామని సీహెచ్ఓ ఎస్వీ రమణ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన మండలకేంద్రంలో మాట్లాడుతూ బోదకాలు వ్యాధికి కారణమైన దోమలు రాత్రి పూట కుడతాయని అవి కుట్టే సమయంలో హెల్త్ సూపర్‌వైజర్లు, వైద్యసిబ్బంది, ఆశ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రజల నుంచి రక్తసమూనాలు సేకరించారని తెలియజేశారు. అలాగే దోమల నివారణకు ఇప్పటికే ప్రతి శుక్రవారం ఫ్రైడే-డ్రైడే కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ నేపథ్యంలో రాత్రిపూట గ్రామాలకు వస్తున్న వైద్య సిబ్బందికి ప్రజలు సహకరించాలని కోరారు.

డోకిశీల పీహెచ్‌సీ పరిశీలన



మలేరియా కేసుల వివరాలు తెలుసుకుంటున్న డీఎంఓ జగన్మోహనరావు

పార్వతీపురం టౌన్: డోకిశీల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు సోమవారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా రోగుల ఆరోగ్య తనిఖీల రికార్డులను తనిఖీ చేసి నమోదు చేసిన అనారోగ్య సమస్యలు, చికిత్సల వివరాలపై సిబ్బందిని ఆరా తీశారు. జ్వరంతో ఆస్పత్రికి ఎవరు వచ్చినా, జ్వర లక్షణాలను స్పష్టంగా తెలుసుకోవాలని సూచించారు. తప్పనిసరిగా మలేరియా నిర్ధారణ పరీక్షలు చేసి ఫలితాలు నమోదు చేసి తగు చికిత్స అందజేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో వైద్యాధికారి ఎం. కౌశిక్, ఏఎంఓ సూర్యనారాయణ, సూపర్‌వైజర్‌లు శ్రీనివాసరావు, కృష్ణంరాజు, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక అభ్యున్నతే సీఎం జగన్ లక్ష్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి

- మహిళలను మోసం చేసిన వ్యక్తి చంద్రబాబు
- 'వైఎస్సార్ ఆసరా' కింద నాలుగేళ్లలో రూ.17.13 కోట్లు రుణమాఫీ
- ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి



సమావేశానికి హాజరైన మహిళా సంఘాల సభ్యులు

కొమరాడ: మహిళల ఆర్థిక అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదర్శవంతమైన పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. మండలం కేంద్రం కొమరాడలో వైఎస్సార్ క్రాంతి పథం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన నాలుగు విడత 'వైఎస్సార్ ఆసరా' చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కరోనా వంటి విపత్కర పరిస్థితిలో కూడ సంక్షేమ పథకాలు అందించి పేద కుటుంబాలు ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. 2014 ఎన్నికల్లో డ్వాకా రుణాలను మాఫీ చేస్తానని మహిళలను నమ్మించి ఓట్లు వేయించుకున్న చంద్రబాబు గెలిచాక ఆ హామీని విస్మరించారని మహిళలను మోసం చేశారని దుయ్యబట్టారు. 2019 ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతీ హామీని జగనన్న అమలు చేయడంతో పాటు అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలిచారని అన్నారు. మహిళల సంక్షేమం కోసం వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా, అమ్మఒడి, జగనన్న తోడు, చేదోడు వంటి పథకాలతో పాటు రైతుభరోసా, వాహన మిత్ర, ఇంటింటికీ రేషన్, ఇంటి వద్దకే వైద్యం(జగనన్న ఆరోగ్య సురక్ష) వంటి అనేక పథకాలను అమలు చేస్తున్నారన్నారు. జగనన్న ప్రభుత్వంలో మహిళలంతా సంతోషంగా ఉన్నారన్నారు. గ్రామ సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజల ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సేవలు చేరుతున్నాయన్నారు. గత టీడీపీ ప్రభుత్వానికి, జగనన్న ప్రభుత్వానికి తేడాను మహిళలంగా గమనించాలని కోరారు.

నాలుగేళ్లలో రూ.17.13 కోట్లు..

ప్రస్తుతం ఎన్నికలు సమీపిస్తుండడంతో చంద్రబాబు టీం మళ్లీ మోసం చేసేందుకు ఇంటికో కారు, కేజీ బంగారం ఇస్తామనే హామీలతో ప్రజల ముందుకొస్తున్నారని, వారి మాటలు నమ్మి మోసపోవద్దని హితవు పలికారు. ఇచ్చిన మాట ప్రకారం హామీలన్నీ అమలు చేసి ఇంటికి పెద్ద కొడుకుగా నిలబడిన జగనన్నను మళ్లీ సీఎంగా చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పిలుపునిచ్చారు. అనంతరం కొమరాడ మండలంలోని 860 స్వయం సహాయక సంఘాల్లోని 9,653 మంది మహిళలకు వైఎస్సార్ ఆసరా పథకం కింద మంజూరైన నాలుగో విడత నిధులకు సంబంధించి రూ.4.33 కోట్ల చెక్కును అందజేశారు. నాలుగుళ్లల్లో మండలంలోని 860 సంఘాలకు ప్రభుత్వం రూ.17.13 కోట్లు నిధులు మంజురు చేసిందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ద్వారపురెడ్డి లక్ష్మి, వైస్ ఎంపీపీలు నంగిరెడ్డి శరత్‌బాబు, కేంద్రక అన్నపూర్ణ, పార్టీ మండల కన్వీనర్ ద్వారపురెడ్డి జనార్దనరావు, మండల సచివాలయ కన్వీనర్ యేగిరెడ్డి సింహాచలం, కొమరాడ, శివిని పీఏసీఎస్ అధ్యక్షుడు మరడాన సూరపు నాయుడు, పప్పల గోపాలకృష్ణ, పార్టీ నాయకులు కళింగి మల్లేశ్వరరావు, ఎంపీడీఓ మల్లికార్జునరావు, వైకేపీ ఏపీఎం సతీష్, వెంకటరమణ, డీపీఎం ప్రవీణ్, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్న సాయం మరవలేనిది



మా సంఘం పేరు శ్రీలక్ష్మీ స్వయం సహాయక సంఘం. మా సంఘంలోని తొమ్మిది మంది సభ్యులకు నాలుగేళ్లలో మొత్తం రూ.4,04,568లు రుణమాఫీ అయింది. ఒక్కో సభ్యురాలికి నాలుగేళ్లలో రూ.44,952 నగదు నేరుగా అకౌంట్‌లో జమ అయింది. ఆసరా పథకంలో మేము ఆర్థికంగా బలోపేతం అయ్యాము. జగనన్న చేసిన సాయం మరువలేనిది.

– చిట్టుబత్తుల నాగమణి, గంగారేగువలస గ్రామం, కొమరాడ మండలం

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం



మాది కనక దుర్గా మహిళా స్వయం సహాయక సంఘం. మా సంఘంలో పది మంది సభ్యులకు వైఎస్సార్ ఆసరా పథకం కింద నాలుగేళ్లలో రూ.4 లక్షలు అందాయి. ఒక్కో సభ్యురాలికి రూ.40 వేలు చొప్పున వచ్చింది. ఆర్థికంగా మేలు చేసిన జగనన్నకు రుణపడి ఉంటాం.

– కొండగొర్రి గంగ, కొత్తవలస గ్రామం, కొమరాడ మండలం

గిరిజన స్పందనకు 104 వినతులు



వినతులు స్వీకరిస్తున్న పీఓ కల్పనాకుమారి

సీతంపేట: స్థానిక ఐటీడీఏలో ప్రాజెక్టు అధికారి కల్పనాకుమారి సోమవారం నిర్వహించిన గిరిజన స్పందనకు 104 వినతులు వచ్చాయి. అంత్యోదయ కార్డు కావాలని పెద్దరాజపురానికి చెందిన ముఖలింగం, ఇల్లు మంజూరు చేయాలని దబ్బగూడకు చెందిన జోగారావు, మేకల కొనుగోలుకు రుణం మంజూరు చేయాలని పాండ్రమానుగూడకు చెందిన కుమార్ వినతులు అందజేశారు. గ్రామానికి కమ్యూనిటీ హాల్ మంజూరు చేయాలని పెద్దగూడ గ్రామస్తులు, రోడ్డు నిర్మించాలని పెదరాజపురం గ్రామస్తులు అధికారులను కోరారు. జీపీఎస్ పాఠశాలకు శాశ్వత భవనం నిర్మించాలని గొట్టిపల్లి గ్రామస్తులు కోరారు. స్పందనలో ఏపీఓ రోసిరెడ్డి, ఈఈ సింహాచలం, డీడీ అన్నదొర, పీఏఓ హరికృష్ణ, డిప్యూటీ ఈఓ లిల్లీరాణి, సీడీపీఓ రంగలక్ష్మి పాల్గొన్నారు.

ఉచితంగానే ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్



సిబ్బందికి సూచనలు చేస్తున్న తహసీల్దార్ సత్యనారాయణ

వీరఘట్టం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలను ఉచితంగానే రిజిస్ట్రేషన్లు చేసి ఇస్తామని తహసీల్దార్ చందక సత్యనారాయణ తెలిపారు. స్థానిక కార్యాలయంలో ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను సోమవారం ప్రారంభించారు. మండలంలో 902 మందికి ప్రభుత్వం ఇళ్ల స్థలాలు మంజూరు చేసిందని, వాటిని రిజిస్ట్రేషన్ చేసి లబ్ధిదారులకు పత్రాలు అందివ్వాలని సిబ్బందికి సూచించారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో పాటించాల్సిన నిబంధనలను వివరించారు. డిప్యూటీ తహసీల్దార్ బి.కుమారస్వామి, ఆర్ఐ లక్ష్మనాయుడు, వీఆర్వో బాసూరు శ్రీనివాసరావు, తదితరులున్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలి



సీఆర్పీలకు సూచనలు చేస్తున్న ఎంఈఓలు నాగభూషణరావు, శ్రీనివాసరావు

జియ్యమ్మవలస: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ నిర్వహించే అన్ని పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు ఉండేలా ఆయా పాఠశాలల హెచ్ఎంలు తగిన చర్యలు తీసుకోవాలని ఎంఈఓలు నాగభూషణరావు, శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని పలు పాఠశాలలను సోమవారం వారు సందర్శించి, అక్కడి వసతులను పరిశీలించారు. విద్యుత్, ర్యాంపులు, బాత్‌రూంలు, ఇతర సౌకర్యాలపై ఆరా తీశారు. ఎన్నికల కమిషన్ సూచనల మేరకు అన్ని వసతులు ఉండేలా చూడాలన్నారు. విద్యార్థుల వివరాలను యూడైస్ ప్లస్‌లో నమోదు చేయాలని, పాఠశాలలకు విడుదలైన ఎస్ఎంఎఫ్ ఫండ్‌ను పాఠశాల అవసరాల కోసమే వినియోగించాలని సూచించారు. అనంతరం మండల విద్యాశాఖ కార్యాలయంలో సీఆర్పీలతో సమావేశం నిర్వహించారు. ఇటీవల నిర్వహించిన పరీక్ష పేపర్లను ఉపాధ్యాయులు వాల్యూయేషన్ చేసి ఓఎంఆర్ సీట్‌లలో వివరాలు ఎంటర్ చేసి వాటిని ఎంఈఓ కార్యాలయానికి అందజేసేలా చూడాల్సిన బాధ్యత సీఆర్పీలదే అని అన్నారు. సంబంధిత సీఆర్పీలు వాటిని తీసుకొని భద్రపరచాలని సూచించారు.

కులగణన సకాలంలో పూర్తిచేయాలి



కులగణనపై సమీక్ష నిర్వహిస్తున్న కమిషనర్ సర్వేశ్వరరావు

పాలకొండ రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కులగణన ప్రక్రియను సకాలంలో పూర్తి చేసేందుకు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు అంకిత భావంతో పనిచేయాలని నగర కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావు అన్నారు. సోమవారం తన కార్యాలయంలో కులగణనపై వార్డు అడ్మిన్ సెక్రటరీలతో సమీక్ష నిర్వహించారు. వార్డుల వారీగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. పట్టణ పరిధిలోని 9 సచివాలయాలను 150 క్లస్టర్లుగా విభజించి సర్వే చేస్తున్నట్లు తెలిపారు. మొత్తం 9,492 గృహాల్లో సుమారు 27,582 మంది నివాసం ఉండగా.. ఇప్పటివరకు 8,255 గృహాల్లో నివాసం ఉంటున్న 19,872 మందికి సంబంధించి కులగణన పూర్తి చేసినట్లు చెప్పారు. సాంకేతిక సమస్యల కారణంగా నమోదులో జాప్యం చోటుచేసుకుంటున్నట్లు చెప్పారు. గడువులోగా లక్ష్యాలను పూర్తిచేస్తామన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

- సీఐడీ డీఎస్పీ డి.లక్ష్మణరావు



మాట్లాడుతున్న సీఐడీ డీఎస్పీ లక్ష్మణరావు

కొమరాడ: గిరిజనులు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని విశాఖపట్నం రీజనల్ సీఐడీ కార్యాలయం డిప్యూటీ సూపరింటెండెంట్ డి.లక్ష్మణరావు అన్నారు. మండల కేంద్రంలోని వైఎస్సార్ క్రాంతి పథం(వైకేపీ) కార్యాలయంలో గిరిజన హక్కులు, సాధికారితపై సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. గిరిజనుల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వాలు అనేక పథకాలు అమలు చేస్తున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకొని లాభపొందాలని సూచించారు. గిరిజనుల కోసం ప్రభుత్వం ప్రత్యేక చట్టాలు రూపొందించిందన్నారు. వాటిపై గిరిజనులు అవగాహన పెంచుకోవడం ద్వారా వారి హక్కులను కాపాడుకోవచ్చన్నారు. తహసీల్దార్ ఎం.భుజంగరావు, ఎంపీడీఓ మల్లికార్జునరావు, గిరిజన సంక్షేమ అధికారి సురేష్, పూడేస్ మాజీ సర్పంచ్ చోడి ఆనంద్ తదితరులు పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పలు పాఠశాలల విద్యార్థులు, యువత పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



బీఎంఆర్ థియేటర్ లైసెన్స్, ఇతర పత్రాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ సత్యనారాయణ

వీరఘట్టం: కొత్త సినిమాలు విడుదలైనప్పుడు ప్రభుత్వ నిబంధనల మేరకు టికెట్లు విక్రయించాలే తప్ప ఇష్టం వచ్చినట్లు రేట్లు పెంచి రోజుల తరబడి విక్రయిస్తామంటే చర్యలు తప్పవని తహసీల్దార్ చందక సత్యనారాయణ హెచ్చరించారు. పట్టణంలోని బీఎంఆర్ సినిమా హాల్‌లో టికెట్ రేట్లు అధికంగా ఉన్నాయని, థియేటర్‌లో కూల్‌డ్రింక్స్, ఇతర తినుబండారాల ధరలు బయట మార్కెట్ ధరకంటే ఎక్కువగా విక్రయిస్తున్నారని ఫిర్యాదులు అందడంతో సోమవారం థియేటర్ సిబ్బందిని పిలిపించి మాట్లాడారు. థియేటర్ లైసెన్స్, టికెట్ రేట్లు, ఇతర ధ్రువపత్రాలను పరిశీలించారు. థియేటర్‌లో ఎన్ని తరగతులు ఉన్నాయి. వాటి టికెట్ ధరలు ఎంత అని థియేటర్ మేనేజర్ సూర్యనారాయణను అడగగా.. అన్ని క్లాసుల టికెట్ ధరలు రూ.100 చొప్పున విక్రయిస్తున్నట్లు చెప్పారు. దీంతో తహసీల్దార్ ఆయనపై మండిపడ్డారు. మీ ఇష్టం వచ్చినట్లు టికెట్ ధరలు నిర్ణయించి అమ్మితే కుదరదని, వెంటనే క్లాసుల వారీగా టికెట్ ధరల పట్టిక, పార్కింగ్ రేట్ల బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే థియేటర్‌ను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఇదిలా ఉండగా టీడీపీకి చెందిన ఓ జిల్లా స్థాయి నాయకుడికి ఈ థియేటర్‌లో వాటాలు ఉండటంతో పన్నులు చెల్లించకుండా మేనేజ్ చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

చాపరాయిజంగిడి భద్రకు బీటీరోడ్డు

- రూ.2.60కోట్ల వ్యయంతో పనులు
- భూమిపూజ చేసిన ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి



ఎగువ తాడికొండ వద్ద బీటీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని ఎగువ తాడికొండ నుంచి చాపరాయి జంగిడి భద్ర గ్రామం వరకు 3 కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు నిర్మాణానికి ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.2.60 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. ఎగువ తాడికొండ గ్రామం వద్ద సోమవారం భూమిపూజ చేసి బీటీ రోడ్డు నిర్మాణ పనులను కురుపాం ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి ప్రారంభించారు. సకాలంలో బీటీ రోడ్డు నిర్మాణ పనులు పూర్తిచేసి గిరిజనులకు పక్కా రోడ్డు సదుపాయం కల్పించాలని అధికారులకు సూచించారు. గత ఏడాది నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో చాపరాయి జంగిడి భద్ర గ్రామానికి పక్కా రోడ్డు నిర్మిస్తానని ఇచ్చిన హామీని నెరవేరుస్తూ బీటీ రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకున్నట్లు గ్రామస్తులకు తెలిపారు. ఆమె వెంట ఎంపీపీ కుంబురుక దీనమయ్య, వైస్ ఎంపీపీ నిమ్మక శేఖర్, జెడ్పీటీసీ మండంగి రాధిక, సర్పంచ్ మండంగి జగ్గారావు, ఎంపీటీసీ ఎం.గౌరమ్మ, వైఎస్సార్‌సీపీ ఎస్టీసెల్ మండల కన్వీనర్ తోయక గోపాల్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పరామర్శ



పార్వతి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్, తదితరులు

పాలకొండ/పాలకొండ రూరల్: నగర పంచాయతీ పరిధి చీమలవీధిలో ఉంటున్న అగ్నిమాపక విశ్రాంత అధికారి లోచర్ల సంజీవరావు భార్య పార్వతి ఇటీవల మృతి చెందడంతో ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, వైఎస్సార్‌సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలే రాజేష్ సోమవారం ఆ కుటుంబాన్ని పరామర్శించారు. పార్వతి మృతికి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఆ కుటుంబానికి పార్టీ తరఫున అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. వారి వెంట నగర పాలకవర్గ సభ్యులు తుమ్మగుంట శంకరరావు, కడగల వెంకటరమణ, కిల్లారి మోహనరావు, దుప్పాడ పాపినాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు ముల్లు సూర్యారావు, దుమ్మిద సింహాచలం, జల్లు నారాయణరావు తదితరులున్నారు.

సమ్మె ఒప్పందాలు అమలు చేయాలి



కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న మున్సిపల్ కార్మికులు

పాలకొండ: మున్సిపల్ కార్మికుల సమ్మె సందర్భంగా ప్రభుత్వంతో జరిగిన చర్చల మేరకు ఒప్పందాలను అమలు చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు దావాల రమణారావు కోరారు. ఈ మేరకు సోమవారం నగరపంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావును కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 16రోజుల పాటు మున్సిపల్ కార్మికులు సమ్మె చేపట్టి వారి డిమాండ్లను ప్రభుత్వానికి విన్నవించారని, వారి సమస్యలు పరిష్కారం కోసం ప్రభుత్వం పలు హామీలు ఇచ్చిందని తెలిపారు. ఆ హామీల అమలుకు సంబంధించి జీఓను విడుదల చేయాలని కోరారు. వినతి పత్రం అందించిన వారిలో పడాల భాస్కరరావు, చింతల సంజీవి, సురేష్, రఘు, శ్రీదేవి, కాద రాము, తదితరులు ఉన్నారు.

పల్లె వాతావరణాన్ని చెడగొట్టొద్దు

పాలకొండ రూరల్: గ్రామాల్లో యువత స్నేహపూర్వక వాతావరణం ఏర్పాటుకు కృషిచేయాలని ఎస్సై ఎస్.ప్రశాంత్‌కుమార్ అన్నారు. మండలంలోని లుంబూరు గ్రామస్తులతో సోమవారం సమావేశమైయ్యారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. విద్యావంతులైన యువత అవకాశాలు అందిపుచ్చుకుని ఉన్నత స్థానాలు అధిరోహించేలా కృషి చేయాలన్నారు. పల్లె వాతావరణాన్ని చెడగొట్టే అసాంఘిక కార్యకలాపాలకు, గొడవలకు దూరంగా ఉండాలన్నారు. పోలీస్ కేసుల్లో చిక్కుకుంటే ఎదురయ్యే ఇబ్బందులపై అవగాహన కల్పించారు. గ్రామస్తులు పోలీస్ వ్యవస్థపై నమ్మకం ఉంచాలని, ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు సహకరించాలని కోరారు. సమస్యలు తలెత్తితే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి



ఎల్ఈడీ లైట్లు అందజేస్తున్న ఎంపీపీ రామారావు

గరుగుబిల్లి: గ్రామాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ ఉరిటి రామారావు అన్నారు. ఎంపీ నిధులతో మంజూరు చేసిన ఎల్ఈడీ లైట్లను సోమవారం మండల పరిషత్ వద్ద వివిధ గ్రామాల ప్రతినిధులకు అందజేశారు. మండలంలోని 25 పంచాయతీలకు ఎల్ఈడీ లైట్లు అందజేయనున్నట్లు చెప్పారు. ప్రజలకు అవసరమైన తాగునీరు, వీధిలైట్లు, కాలువల నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. ఎంపీడీఓ జి.పైడితల్లి, నాయకులు బి.చంద్రశేఖరరావు, పి.సత్యనారాయణ, సిబ్బంది ఉన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

గరుగుబిల్లి: గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్లు ఎంపీపీ ఉరిటి రామారావు అన్నారు. మండలంలోని గొట్టివలసలో తాగునీటి బోరు ఏర్పాటుకు సోమవారం భూమిపూజ నిర్వహించారు. గ్రామస్తుల అభ్యర్థన మేరకు గొట్టివలసలో రేగాలమ్మ గుడివద్ద, చర్చివద్ద బోరు బావుల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. రానున్న వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ గౌరీశంకరరావు, తదితరులున్నారు.

సేవలు మరింత విస్తృతం చేయండి



వైద్యాధికారి కమల్‌నాథ్‌ను సన్మానిస్తున్న వైద్య సిబ్బంది

పాలకొండ రూరల్: ప్రస్తుత సీజన్‌లో వైరల్ జ్వరాలు అధికంగా నమోదవుతున్నందున గ్రామీణ వైద్య సిబ్బంది క్షేత్రస్థాయిలో సేవలు మరింత విస్తృతం చేయాలని అన్నవరం పీహెచ్‌సీ వైద్యాధికారి వి.కమల్‌నాథ్ అన్నారు. పీహెచ్‌సీలో సోమవారం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమంలో అనుసరించాల్సిన విధివిధానాలను వివరించారు. దీర్ఘకాల ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్న వారి వివరాలను తక్షణమే వైద్యుల దృష్టికి తీసుకురావాలన్నారు. తద్వారా వారికి అవసరమైన వైద్యసేవలు అందించటం లేదా పెద్దాస్పత్రికి రిఫర్ చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రతీ బుధ, శనివారాల్లో ఐదేళ్లలోపు చిన్నారులకు అందించాల్సిన వ్యాక్సినేషన్ ప్రక్రియను సమర్థవంతంగా చేపట్టాలని సూచించారు. అనంతరం ఉత్తమ వైద్యాధికారిగా గణతంత్ర వేడుకల్లో అవార్డు అందుకున్న డాక్టర్ కమల్‌నాథ్‌ను హెల్త్ సూపర్‌వైజర్లు కిమిడి రాణి, బలివాడ జగదీష్, సహచర సిబ్బంది ఘనంగా సన్మానించారు.

ప్రకృతి సాగు ఉత్పత్తులు ఆరోగ్యానికి మేలు



ప్రకృతి వ్యవసాయ విధానంలో పండించిన ఆకుకూరలను చూపిస్తున్న సిబ్బంది

జియ్యమ్మవలస: మండలంలోని పెదమేరంగి కూడలి వద్ద ప్రకృతి వ్యవసాయ అసోసియేట్ అన్నపూర్ణ చేతులమీదుగా సోమవారం ప్రకృతి వ్యవసాయ విక్రయ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయ విధానంలో పండించిన పంటలు ఆరోగ్యానికి మేలు చేస్తాయన్నారు. ఏ విధమైన రసాయన ఎరువులు, పురుగు మందులు వినియోగించకుండా సాగు చేసే పంటలను ప్రతీ సోమవారం ఇక్కడ విక్రయానికి ఉంచుతున్నట్లు చెప్పారు. వాటిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు వినియోగదారులకు చేరువచేసేలా చూడాలని కార్యకర్తలకు సూచించారు.

ఇసుక ట్రాక్టర్ బోల్తా



బోల్తాపడిన ఇసుక ట్రాక్టర్

మక్కువ: మండలంలోని డి.శిర్లాం గ్రామంలో గోముఖి, సువర్ణముఖి నదుల కలయిక వద్ద ప్రాంతం నుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ సీతానగరం మండలం కొత్తవలస వైజంక్షన్ వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. నదినుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా, పోలీసులు వచ్చినట్లు ట్రాక్టర్ డ్రైవర్‌కు తెలియడంతో వేగంగా వెళ్లడంతో అదుపు తప్పి బోల్తాకొట్టినట్లు అంతా భావిస్తున్నారు. అయితే ఈ ఘటనలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. బోల్తా పడిన ట్రాక్టర్‌ను రాజకీయనాయుకుల అండతో, గుట్టుచప్పుడు లేకుండా తరలించినట్లు సమాచారం.